**హెడ్ క్వార్టర్సులో ఒ**
**మీటింగులో పాల్గొని ఆ**
**సుకు ఆలస్యంగా వచ్చేసరి**

ఆఫీసు సూపరింటెండెం భాస్కర్రావు ఒకవార్త బెక్కుతూ చెప్పా తాళాల గుత్తు కనపడలేదు. గుప్తమై సమాచారంకల ఫైళ్ళు, పుస్తకాలు, మే లుంచిన రెండు స్టీలు బీరువాల తాళాల మాటాడితే నేనే ఆ బీరువాలిప్పే ఓపిక తీ బడిలేదని, ఆ రెండు తాళాలు నా స్టెనో మరు మాధవికి అందజేసాను. వాటి డూ కేటు తాళాలు హెడ్‌క్వార్టర్సులో పెద్ద ఆ సరు దగ్గర వున్నాయి.



మాధవి నాఆఫీసుకు బదిలీమీద ండు నెలలైవచ్చింది. వారం రోజుల్లోనే తన పనిలో ప్రావీణ్యాన్ని చూపించి, మ్మ కంగా మెసలటంవలన ఆఫీసులో న్ని ముఖ్యమైన ఫైళ్ళు ఆమె పరం సు. ఆఫైళ్లు యీరెండు బీరువాల్లోనే వు య

మాధవి గురించి నాకు తెలిసిన వివరా లేమిటంటే-భర్తరోజూ ఉదయం ఆఫీసుకు స్కూటర్ మీద దిగబెట్తాడు. సాయంత్రం బస్సులో వెళ్తుంది. ఇద్దరు ఆడపిల్లలు. ఒకోరోజు కళ్ళు తీక్షణంగా చూసేవి. గొంతుక పెడసరంగా పలికేది. ఉద్వే గంతో కదిలేది. కారణాలు తెలుసుకోవటం అసాధ్యం. ఎంచేతంటే మరోరోజు పట్ట లేని సంతోషంతో నవ్వేది. ముందురోజుకీ మరుసటి రోజుకు యింత మార్పురావటం వలన కలలో కాంతలావున్నా, నీటిలో నీడనే వుద్దేశంతో మిగతా గుమస్తాలు దూరంగా వుండేవారు.

# గాజు బొమ్మ

## బలివాడ కాంతారావు

మాధవి, భాస్కర్రావు కేషియర్ రమణ ఒకే గదిలో కూర్చుంటారు. తాళా గుత్తి యెలా పోయిందో భాస్కర్రావు యిలా చెప్పాడు—

"ప్యూను రామయ్యకు తాళాలి ఒక ఫైలు తెమ్మందట మాధవి. రామయ్య ఫైళ్ళుతెచ్చి ఆఫైలు తాళాలగుత్తి టేబిల్ మీద పెట్టి వెళ్ళిపోయాడు. తరువాత తన పని తనుచేసుకుంటూ వున్నాడు. మాధవి యిది వరకు ఆఫీసులో పనిచేసే ఒక అమ్మాయివస్తే కేంటీనుకు తీసుక వెళ్ళింది ఆమె తిరిగి వచ్చేవరికి లంచ్ టైముకదా మేంఅంతా వెళ్ళిపోయాం. ఆగదిలో యెవరూలేరు. మాధవి తిరిగివచ్చి ఫైళ్ళు తీసుకుని తాళాలేవంటే టేబిలుమీద పెట్టా సావని రామయ్య అన్నాడు. అందరం వెతికాం. అన్నిచోట్ల వెతికాం. దొరకలేదు"


"ఇంకా వెతకండి" అన్నాను. మాధవి ముఖం నాకు చూపించలేదు. మాధవి యెక్కడ?" అన్నాను. సీటుమీద తలపెట్టి యెత్తిలేదు. ఆమెను లేవమనైనా అనలేదు యేడుస్తుందనేభయం" అన్నాడు భాస్కర్రావు.


"సరే! మళ్ళీ వెతకండి" అని నేనూ నాగదిలో వెతికాను. ఆఫీసుమూసే వేళకు దొరకలేదు. బయటవరండాలో తిరుగుతూ చూస్తే ఒక్క కామరాజు తప్పించి ఎవరూ వెతుకుతున్నట్లు కనపడలేదు. తాళాలు అందివ్వకుండా టేబిలుమీద పడవేసిన రామయ్య కూడా దర్జాగా సీటులో కూర్చుని బాతాకానీ చేస్తున్నాడు. కోపంవచ్చి "రామయ్యా యిలారా" అన్నాను. వాడు వరండా మీదకు రాగానే

"తాళాలు వెతికి నాకిచ్చే వరకూ నువ్వు ఆఫీసు కదిలి వెళ్ళడానికి వీల్లేదు" అని అరచాను.

రామయ్య నీఅరుపుల బులెట్లు నాకు తగలవన్నట్లు "వెతికానుసార్! తాళాలు యెవరో కాజేసారు. ఇంట్లో దొంగను ఈశ్వరుడైనా పట్టలేడుకదా. నేను పోలీసును కాను. అసలు పోలీసులను పిలవండి" అన్నాడు నిర్భయంగా.

రామయ్య నిజానికి మేకు కొట్టినట్లు అబద్ధం ఆడుతున్నాడనుకుని మళ్ళీ గది లోనికి వచ్చాను. టైము కాగానే ఆఫీసంతా ఖాళీ. ఒక్క భాస్కర్రావు వుండిపోయాడు నేను భాస్కర్రావే మిగిలాం. నా గదిలోనికి వచ్చి "సర్! మాధవికి బుద్ధి చెప్పాలని యెవరో దుండగులు చేసేపని యిది" అన్నాడు.






"ఆఫీసులోవున్న ఒకే ఒక స్త్రీని యిలా యెవరు బాధపెట్టారు?"

"కామరాజు చాపకింద నీరు లాంటి వాడు."

"మాధవిని అల్లరి పెడ్తే వాడికేం వస్తుంది?"

"ఆ మధ్య యిద్దరూ మాటా మాటా అనుకున్నారు."

"ఎందుకూ?"

"నాలుగు పేజీల పెద్ద స్టేట్‌మెంటు తెచ్చి టైపు చేస్తావా లేదా అని కూర్చు న్నాడు. అసలు యెవరి టైపింగు వాడు చేసుకోవాలి. నేను చెయ్యలేననేసింది మాధవి. బాస్ లేడు కదా ఊరకే కూర్చుం టున్నావ్. చెయ్యి అని ఆజ్ఞాపించాడు. కాని నేను చెయ్యనుపో అనేసింది. దానితో మాటా మాటా ముదిరిపోతే, నేను మధ్య పడి కామరాజును వాడి గదికి పంపేశాను."

"నాతో ఆ విషయం యెందుకు చెప్ప లేదు? గుమస్తాలందరినీపిలిచి స్టెనోగ్రాఫరు నా డిక్టేషన్లు తీసుకోడానికేగానీ అందరి టైపింగు పనులు చెయ్యడానికికాదని స్పష్టం చేసేవాడినే."

"ఇదివరకున్న స్టెనో తీరుబడి వుంటే మిగతా వాళ్ళకు సహాయం చేసేది. అలాగే అనుకుని ఆర్డరువేస్తే మాధవి పొమ్మంది."

"కామరాజే ఆ తాళాల గుత్తు తీసినట్లు నిదర్శనం యేమిటి? ఎవరైనా చూశారా!"

"చూడలేదుగానీ - ఆఫీసులో అందరికీ యిది వాడిపనే అని అనుమానం వుండబట్టి మీరు చెప్పినా వెతకడం ఆపేసారు."

"కామరాజు నమ్మకమైన పనివాడు. ఈపనివాడు చేస్తాడంటే నేను నమ్మలేను."

"మీనోటీసుకు తేలేదు. ఆమధ్య రైల్వే రసీట్లుగుత్తు పోయింది. స్టోరుకీపరు శాస్త్రి వెతికి వెతికి పిచ్చెత్తి పోయాడనుకోండి. రెండు రాత్రుళ్ళు నిద్దర లేదట అది కామరాజుపనే"

"ఏం చేసాడు?"

"శాస్త్రి, కామరాజు టేబులుమీద ఆగుత్తు మరచిపోయాడు. ఇదివరకు సబ్బు, తువ్వాళ్ళ స్టోరునించి యిమ్మంటే యివ్వలేదని కామ రాజుకు శాస్త్రిమీద కోపంవుంది. ఇలా తీర్చుకున్నాడు."

"వాడు తీసినట్లు యెవరైనా చూసారా?

"నేను బీరువా వెనుక కూడా వెతికాను. దొరకలేదు. మూడోరోజు ఉదయం ఆబీరువా వెనుకే ఆగుత్తు దొరికింది. అప్పుడుశాస్త్రికి అంతా గుర్తువచ్చి తిట్టేసాడు. కామరాజుకీ శాస్త్రికీ మాటల్లేవు."

"శాస్త్రిని బాధ పెట్టాలంటే ఆగుత్తు దాచేసే వాడుకదా!"

"కామరాజు దేముడి ఆభరణాలు దొంగి లించిన పూజారిలాంటివాడు. ఆ ఆభరణాలు వాడేం చేసుకోగలడు? అమ్మలేడు. తొడగ లేడు. పాపభీతితో మళ్ళీ ఆదేముడిమీదే పారేస్తాడు. ఇదీ వాడితంతు"

"అయితే రేపు వుదయం నాయెదరగా కామరాజును పెట్టండి, సూటిగా అడిగేస్తాను"

"కూర్చుంటే, కుంటివాడంత అమాయ కుడిగా కనిపిస్తాడుసార్? వాడిని యెందులో పట్టుకోగలరు చెప్పండి?"

"ఏం?"

"వాడు లేచాడంటే లేడిలా పరుగెత్తగల డండీ - వాడి పనితనం చూసి మీరు గులా బిలా చూస్తే మిమ్మల్ని ముళ్ళతో పొడిచా డండీ?"

"నన్నా?"

"మరి యిదంతా యేమిటిసార్! తాళాలకి మాధవి కాదు, మీరు జవాబుదారి అవుతారు కదా."

ఈ కామరాజు గురించి యింటికి వెళ్ళి పోయినా తలుచుకోకుండా వుండలేక పోయాను. ఆఫీసులో అన్ని పనులూ తెలి సినవాడు. చెప్పకండా పనిచేసి నా మెప్పు పొందినవాడు. వాడు శలవులోవెళ్తే ఆ పని అంతా అలా పడివుంటుంది గానీ భాస్క-రావుతోసహా యింకొకరు ముట్టలేరు. అందుకే కామరాజు పనిమీద భాస్కరావు అజమాయిషీ పెట్టకండా నేనే స్వయంగా చూసుకుంటాను. బహుశః ఈ పరిస్థితి భాస్కరావుకు నచ్చకపోవటం వలన ఇలా అంటున్నాడన్న అనుమానంకలగకపోలేదు. తాళాలు యెవరో దాచి నాటకాలాడుతున్నా రని రైల్వే రిసీట్లులా యివీ రెండు మూడు రోజుల్లో దొరకవచ్చన్న ఆశతో పై అధి కారులకు యీ విషయం తెలియజెయ్యలేదు.

ఉదయం నేను ఆఫీసుకు వెళ్ళేసరికి మాధవి రాలేదు. భాస్కరావు నా గదిలోనికి వచ్చి"మాధవిని తెల్లారుఝామున ప్రవేటు ఆసుపత్రిలో చేర్చారు" అన్నాడు.

"నీకెవరు చెప్పారు?"

"ఉదయమే మా యింటికి వచ్చి మాధవి భర్త చెప్పాడు."

"ఏమైంది?"

"రాత్రంతా నిద్దరలేదట. తాళాలగురించి

పలవరిస్తూనే వుందట. వేకువఝామున రక్తస్రావంతో ఆసుపత్రిలో చేర్చవలసి వచ్చిందట."

"వెంటనే ఆసుపత్రికి వెళ్ళండి. తాళాలు నా డ్రాయరులో దొరికాయని చెప్పండి" అన్నాను. భాస్కర్రావు ఆసుపత్రికి వెళ్ళి ఒక గంటలో తిరిగి వచ్చాడు.

"కాస్త మత్తు మత్తుగా వుందండి. ఒక్కరోజుకే సరిగ్గా మాట్లాడలేని నీరసం. మీరన్నట్లు తాళాలు దొరికాయని చెప్పాను సార్. ఏవీ తాళాలని అడిగింది?"

"ఏమన్నావు?"

"సాయంత్రం చూపిస్తానన్నాను అలా అనటం పొరపాటేకాని చప్పున ఆ పరిస్థితి చూసాక అలా అనేసాను."

"ఆఫీసులో అందరినీ పిలవండి" అన్నాను. కొద్ది నిముషాల్లో గుమాస్తాలందరూ, ప్యూన్ రామయ్యకూడా నా ఎదరగా నిల్చున్నారు. మాధవి ప్రస్తుత పరిస్థితి చెప్పి అన్నాను-

"మాధవి మన ఆఫీసులో ఒక్కతే స్త్రీ. రేపు ప్రొద్దున్న మన కుమార్తెలు, చెల్లెళ్లు, భార్యలు కూడా పని చేస్తారు. మనం యీ రోజు యీ ఒక్క స్త్రీని యిలా బాధ పెడితే రేప్రొద్దున్న మనవాళ్ళని యింకొకరు బాధ పెడ్తారు. తాళాలు పోలేదు. ఇవి ఎక్కడో యెవరో దాచారు. ఆవిడ ఒక మంచివాని భార్యగా, యిద్దరు అమాయకమైన బిడ్డల తల్లిగా వేగంగా కోలుకోవాలంటే యీ రెండు తాళపుచెవులు కావాలి. మీకెందుకూ పనికిరావు. కానీ అవి ఆమె కోలుకోవడానికి అవసరం."

ఎవరూ మాకుతెలీదు మాకుతెలీదన్నట్టు మాటాడలేదు. లేచి చప్పున రామయ్య యెదరగా నిల్చొని-

"నువ్వు తాళాలు ఆమె చేతికి తిరిగి యివ్వలేదు. ఎవరి మాటో విని ఎక్కడో దాచావు. సాయంత్రం సరికి నాకు తాళాలు అప్పచెప్పకపోతే నీ పని పట్టిస్తాను" అని అరిచాను. కామరాజుకు తగలాలని మరీ అరిచాను.

రామయ్య నిదానంగా "అయ్యా! నేనూ వెతికాను. నేను ఆమె టేబిలుపైన తాళాలు పెట్టినట్లు బాగా గుర్తుంది. మాధవి నా చెల్లెలు లాంటిది. కావలిస్తే అడగండి. వాళ్ళ యింటి బజారు నేనే చేస్తుంటాను. కావలసిన మందులు నేనే తెస్తుంటాను. వాళ్ళిద్దరూ సినిమాలకు వెళ్తే పిల్లలిద్దరూ మాయింట్లోనేవుంటారు. ఆవిడతల్లి పిచ్చాసుపత్రిలోవుంది. అసలే కష్టాల్లోవుంటే నేను పొరపాటునైనా ఆమెకు అపకారం చేస్తానా?"

ఇంగ్లీషులో "గో అవే" అని అరచాను. భాస్కర్రావు తప్పించి అంతా వెళ్ళిపోయారు.

"సర్-రామయ్య అన్నది నిజమేనండి. రామయ్య మాధవికి అన్యాయం చెయ్యడు. ఇది తప్పక కామరాజుపనే. ఎవరూ లేక లేకపోవడంచూసి తాళాలు కాజేసాడు."

"మాధవి నీతో అలాచెప్పిందా?"

"ఆమె భర్తతో చెప్పిందట"

సాయంత్రం నేనూ మా ఆవిడ కలసి ఆసుపత్రికి వెళ్లాం. మాధవి నీరసంగావున్నా మత్తుమీదలేదు. కొంత దూరంనించే నేను తాళాల గుత్తి చూపించాను. అలా తేరి కాస్సేపు చూసింది.

"అవి ఆ తాళాలు కావు" అందిమాధవి.

"అవే-ముమ్మాటికీ అవే...."

"కట్టిన తాడు అదికాదే-ఒకసారి చూడనివ్వండి" అంటూ చెయ్యిచాపింది.

కొంత మనసులో జంకినా పైకిధీమాగా చేతికి అందిచ్చాను. ఒకసారి పరీక్షగాచూసి

"అవేసైజు. అలాగే కనిపిస్తున్నాయి. కానీ వేరే నంబర్లు."

మాధవి జ్ఞాపక శక్తిని సరిగ్గా అంచనా వెయ్యక పోవటంవలన యీ పొరపాటు జరిగింది. రేపు ప్రొద్దున్న డూప్లికేట్లు అని చెప్పగల అతి తెలివి యీమెది. ఉదాసీనంగా-

"మాధవీ! తాళాలు పోయాయే అనుకో బంగారమా - భాగ్యమా? ఇంకో జత చేయిస్తాం."

అలా నావేపు నిదానంగా చూస్తుంటే మళ్ళీ అన్నాను "నువ్వు పోగొట్టలేదే! రామయ్య పోగొట్టాడు. నిజానికి మీఇద్దరు కానేకారు. ఆఫీసు పెద్దగా నేను పోగొట్టాను. బాధ్యతనాది. ఎందుకలా చిన్నబుచ్చుకుని బాధపడ్తావ్? పిల్లలు నీకోసం యేడుస్తున్నారు. ధైర్యం తెచ్చుకో - వేగం యింటికివెళ్ళు."

ఇంత విన్నాక కొంత బలం చేకూర్చుకుని "విలువ కాదుసార్ - నమ్మకం. మీరు నన్ను నమ్మారు. తాళాలిచ్చారు. ఇచ్చే ముందు వివరంగా జాగ్రత్తలు చెప్పారు. ఇదె నమ్మకద్రోహం."

"ఇవి చిన్న విషయాలు. ఎవడో చేసిన పనికి నివ్విలా బాధపడటం బాగులేదు. నివ్వెన్నో గొప్పలు సాధించడానికి వుండగా యింత పిరికితనం పనికిరాదు. ధైర్యం తెచ్చుకో."



"సర్! మానాన్న, మా ఆయనా, తెలిసవాళ్లూ, మీలాంటి ఆఫీసు పెద్దలూ అంతా ఎంతో అనురాగం చూపించారు, ఆరోగ్యం సరైనది కాకపోయినా అందుకే యిలా యీడ్చుకొస్తున్నాను. తొలిసారి యిప్పుడు నన్నెవరో మోసగించారు. అందుకే తట్టుకోలేక పోతున్నాను-" కాస్త గొంతుక పెగిలి గట్టిగా "అందుకే తట్టుకోలేక పోతున్నాను" అని యేడుస్తోంది. ఏదో అందామనుకుంటే డాక్టరు నన్ను లోపలికి పిలిచాడు. ఎదరగా తనగదిలో కూర్చోబెట్టి-

"మీరేనా ఆమె ఆఫీసుపెద్ద?" అన్నాడు

"అవును"

"ఆమె ఉద్వేగంచెందే పరిస్థితి తేకండి"

"నీరసంగా వుందా?"

"అంతేకాదు-ఆమెది చాలా సున్నితమైన మనసు. గడి తప్పుతోంది. అందుకే మానసిక వ్యాధులను చూసే డాక్టరు కోసం కబురంపాను."

"ఆ పరిస్థితి రాకుండా చెయ్యలేరా?"

"ముందు ఆ తాళాల గుత్తి కావాలి. ఆలస్యం అయితే లాభంలేదు. ఆమె చూసి అవేనన్న నమ్మకం కుదిరితే కాస్తవుద్వేగం తగ్గుతుంది. మనసు కుదుటపడితే పరిస్థితి అదుపులోనికి తేవచ్చు."

మరుసటిరోజు వుదయం మళ్ళీ అందర్నీ పిలిచి ఆసుపత్రిలో ముందురోజు జరిగిన సంఘటన అంతా చెప్పి-

"ఆ తాళాల గుత్తి యిస్తే సరి. జరిగినదంతా పొరపాటు అని మరచిపోతాను. ఒక కుటుంబాన్ని కూల్చకండి- రక్షించండి."

అందరూ ఒకిరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. అరిస్తే లాభంలేదని చేతులు జోడించి "దయచేసి బాగా యింకోసారి వెతకండి" అని ప్రాధేయపడ్డాను. కొంతసేపయ్యాక మెల్లగా వరండాలోనికి వెళ్ళి గదుల్లోకి చూస్తే ఒక్క రామరాజే వెతుకుతున్నాడు. మిగతావాళ్ళను ఎందుకు వెతకలేదని అడగలేదు. వాళ్ళందరూ యీ పని చేసింది కామరాజేనని ధృఢ నమ్మకంతో ఉన్నారు. అందుకే వెతకలేదనుకున్నాను. కామరాజు వెతుకుతుంటే అటువేపే వాళ్ళు చూస్తున్న చూపుల్లో మాటలున్నాయ్.

"మా అందరి కళ్ళు కప్పడానికి నువ్వు వెతుకుతున్నావని మేం పోల్చుకోలేదా?" అంటున్నాయి ఆ చూపులు. నేనూ అలాంటి నిర్ధారణకే వచ్చాను. రెండు రోజులైనా తాళాలు దొరకలేదు. కామరాజుమీద నా కోపం అధికమైనా వాడు చేసే పనిలోగానీ, నడతలోగానీ లోపం యెంచడానికి యేమీ దొరకడంలేదు. ఆఫీసుకు టైములో వస్తున్నాడు. టైములో వెళ్తున్నాడు. కానీ నిండంటే ముభావం అల్లుకుని వాడిని చూడగానే యిదివరకు వుండే ఆ ప్యాయత పోయింది.

మాధవిని పిచ్చాసుపత్రిలో చేర్చారన్న వార్త వినగానే వరండాలోకివచ్చి బిగ్గరగా-

"ఆపాపి - ఎవరైతేనేం? వాడి కుటుంబం అంతా పిచ్చి అయిపోతుందని" అన్నాను.

ఆఫీసు గదుల్లోనించి అంతా బయటకు వచ్చేసారు. నిశ్శబ్దం. చాలాసేపైనా నిశ్శబ్దంగా కదలకుండా అంతా నిల్చున్నారు. ఇప్పటికైనా తను చేసిన తప్పిదాన్ని కామరాజు ఒప్పుకుంటాడని వాడివేపు నిదానంగా తీవ్రగా చూసాను. నేను అలా చూసానని, ఎందుకు వాడివేపే చూసానో మిగతా అందరికీ తెలుసునన్నట్లు మౌనంగా ఉన్నారు.

నేనేదో చేతకానివాడినైపోయినట్లు బాధపడ్డాను. అసలు ఆ తాళాలు ఆమె కిచ్చి యింత గొడవకు కారకుడినయ్యానన్న బాధతో ఆ రాత్రంతా నాకు నిద్దరపట్టలేదు. వారంరోజులైనా మామూలు మనిషిని కాలేకపోయాను.

ఒకరోజు ఆఫీసులో మధ్యాన్నం భాస్కరావు గబగబా నాగదిలోనికి వచ్చి "తాళాలు దొరికాయి సార్" అన్నాడు.

"కామరాజు గదిలోనేనా?"

"కాదు. నేనున్న గదిలోనే—"

"నీ గదిలో పడేసి వుంటాడు."

"లేదుసార్."

"అసలు యెలా దొరికింది?"

"ఒక ఆడిట్ అబ్జక్షనుకు జవాబు యివ్వడానికి ఒక పాత ఫైలు కావలసి వచ్చింది. నా అలమారులో అడుగున పెట్టిన పాతఫైలు తీస్తే అందులోనించి తాళాలు జారాయి".

"అందులో కామరాజు దాచివుంటాడు."

"కాదండీ. కవరుచుట్టి దారంతో కట్టిన పాత ఫైళ్ళలో పడేయడం కుదరదండీ."

"అయితే తాళాలు అందులోనికి యెలా వెళ్ళాయి?"

"ఆబుద్ధు రామయ్యే అందులో వేసి కట్టేసాడు."

"అయితే యెందుకు చెప్పలేదు?"

"వాడికీ తెలీదండీ! తాళంగుత్తి మాధవి టేబిల్‌మీద పెట్టడం నిజమే. కొంతసేపయ్యాక తిరిగి వచ్చి ఆ టేబిలు మీదవున్న పాతఫైలుతోసహా మరికొన్నిఫైళ్ళుఅక్కడే కట్టి నా బీరువాలో తోసేసాడు. ఇది ఎవరి తప్పూ కాదు."

సాయంత్రం తాళాల గుత్తి పట్టుకుని పిచ్చాసుపత్రికి వెళ్ళాను. అలా మౌనంగా కూర్చుంది మాధవి. పేరు పెట్టి పిలిచాను. జవాబులేదు. తాళాలు ఆడించి చప్పుడు చేసాను. ఒకసారి నిదానంగా చూసింది.

"ఇవిగో తాళాలు.... అవే...."

"అ వి కా వు...." అన్నట్లు తల ఆడిస్తోంది.

"అవే....అని అరిచాను.

"అవికావు....అవికావు" అన్నట్లు తల మరీ జోరుగా ఆడిస్తోంది.

"చూడు అవే నంబర్లు" అని నేనరుస్తున్నాను.

"అవికావు.... అవికావు.... ఇవి డూప్లికేట్లు" అని మాధవి అరుస్తోంది. ఇంకా అక్కడ వుంటే నేనూ పిచ్చెక్కుతానేమో నన్న అనుమానం వేసి తిరుగు ముఖం పట్టాను.

*

జ్యోతి